## బస్సొచ్చింది.. బాధ తీరింది..

నమస్తే ఎఫెక్ట్



డబుల్ బెడ్రూం ఇండ్ల నుంచి బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులు

నిర్మల్ అర్బన్, జూలై 11 : పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సరైన బస్సులు లేక బడులకు వెళ్లడం లేదు. ఈ విషయాన్ని ఈనెల 3వ తేదీన 'బస్సులు నడవక.. బడికి పోలేక..' శీర్షికన టాబ్లాయిడ్‌లో నమస్తే తెలంగాణ ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు నిర్మల్ పట్టణంలోని బంగల్ పేట్ డబుల్ బెడ్రూం ఇండ్ల నుంచి వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు గురువారం బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దీంతో విద్యార్థులు, కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



సెర్ప్ సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

ఎదులాపురం, జూలై 11 : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని సెర్ప్ సీఈవో దివ్యదేవరాజ్‌ను గురువారం హైదరాబాద్‌లో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సదరంలో తిరస్కరణకు గురైన వారి పేర్లను మళ్లీ రీ అసెస్మెంట్ చేయాలని కోరారు. కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు బావునే నగేశ్, ప్రధాన కార్యదర్శి నన్నయ్య, పట్టణ అధ్యక్షుడు దూపే శంకర్, కార్యదర్శి సంతోష్‌సిద్ధి, సభ్యులు అప్సర్, బాబుఖాన్, ప్రమోద్ కుమార్ ఉన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల ర్యాలీ

### నగదు రహిత వైద్య చికిత్సలు అందించాలని వినతి




ర్యాలీ వస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఎదులాపురం, జూలై 11 : నగదు రహిత వైద్య చికిత్సలు అందించే పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగులకు ఆదిలాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి, ఏవో అరవింద్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ.. అనేక సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ఈహెచ్‌ఎస్ పథకం సక్రమంగా అమలు కాకపోవడంతో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నామన్నారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పడగంటి కిష్టయ్య, రాజేశ్వర్‌రెడ్డి, జి.నారాయణరెడ్డి, నరేందర్, లక్ష్మణచారి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు లహరి బస్సులు

ఎదులాపురం, జూలై 11 : ఆదిలాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, ఒంగోలు పట్టణాకు వెళ్లే ప్రయాణికులకు లహరి ఏసీ సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం కే.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోని సుఖవంతమైన ప్రయాణం చేయాలన్నారు.

## రాథోడ్ రమేశ్ సేవలు మరువలేనివి..





రాథోడ్ రమేశ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఉట్నూర్, జూలై 11 : మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సేవలు మరువలేనివని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం స్థానిక పూలాజీ బాబా పాఠశాలలో పెద్దకర్మ(తెర్వి) కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ పేదల అభివృద్ధి కోసం పోరాడిన నాయకుడన్నారు. అటువంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, భైంసా ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ జడ్పీటీసీ రాథోడ్ జనార్దన్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, రాథోడ్ బాపూరావ్, నాయకులు జాన్సన్ నాయక్, శ్రీరాంనాయక్, తదిత రులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్టు

ఎదులాపురం, జూలై 11 : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ కే.ఫణిదర్ తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామ శివారులో రూరల్ గురువారం ఇన్‌చార్జి ఎస్ఐ విష్ణువర్ధన్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో బుర్నూర్ గ్రామం వైపు నుంచి ఆదిలాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న పెందూర్ లక్ష్మణ్ పోలీసులను చూసి వెనక్కి వెళ్లే ప్రయత్నం చేశాడు. పోలీసులు వెంబడించి అతని వద్ద వెతుకగా కవర్‌లో 800 గ్రాముల గంజాయి దొరికింది. గాదిగూడ మండలంలోని కట్టగూడ గ్రామానికి చెందిన మెస్రం లింగు వద్ద గంజాయి తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. లక్ష్మణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపాడు. అమ్మిన వ్యక్తి లింగు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపాడు.

# రైతులకు మేలు చేయండి



ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మాట్లాడడానికి అవకాశం కల్పించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

- ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో మంచి జరగాలి..
- రైతు భరోసా పథకంలో కోతలు పెట్టవద్దు..
- ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకంగా చూడాలి..
- అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలి..
- ఉట్నూర్ రైతుభరోసా సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు
- పాల్గొన్న మంత్రులు భట్టి విక్రమార్క, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 11(నమస్తే తెలంగాణ) : రైతుభరోసా పథకం అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిలను రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు కోరారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్‌లో రైతు భరోసా పథకంపై జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను సబ్‌కమిటీ ఎదుట వెల్లడించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. పది ఎకరాల వరకు రైతు బంధు ఇవ్వాలని రైతులు సూచిస్తున్నా, వారు తమ మనసులో వేరే ఆలోచన లేకుండా అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. వర్షాలు ఎక్కువ పడినా, వానలు లేకున్నా రైతులు పంటలు నష్టపోతారని, ఇతర జిల్లాలతో పోల్చితే ఆదిలాబాద్ జిల్లా రైతులు పదెకరాల భూమి ఉన్నా పేదవారుగా ఉన్నారన్నారు. రైతుభరోసా విషయంలో ప్రత్యక మినహాయింపు ఇవ్వాలని కోరారు. కుప్టీ ప్రాజెక్టు నిర్మాణం వల్ల బోథ్ నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతుందని, ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రారంభించిన రైతుబంధు పథకం ఇప్పుడు రైతు భరోసాగా మారిందన్నారు. భూస్వాములకు కాకుండా అర్హులైన వారికి రైతుబంధు ఇవ్వాలని, రైతుబీమా పథకాన్ని కొనసాగించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### కోతలు విధించవద్దు..

రైతుభరోసా పథకంలో భాగంగా సాగు భూములకు కోతలు విధించవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. జిల్లా రైతంగాన్ని ప్రత్యేకంగా పరిగణించాలని, ఇతర జిల్లాల రైతుల మాదిరి చూడవద్దని తెలిపారు. రైతులు పండించిన పంటలకు ఫసల్ బీమా వర్తింపచేయాలని, ప్రభుత్వం ప్రీమియం చెల్లించాలని కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. జాబ్‌కార్డులు ఉన్న రైతు కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అటవీ భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ.. పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్లాంటేషన్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్న భూముల్లో పోలీసు బందోబస్తు మధ్య మొక్కలు నాటుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. పంటలకు బోనస్ చెల్లించాలని సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. కొందరు అధికారులు ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని, పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లా రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న రైతులు

## డీఎస్సీని వాయిదా వేయాలి

డిప్యూటీ సీఎంకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి



మంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 11 : అభ్యర్థుల ఇబ్బందుల దృష్ట్యా డీఎస్సీ పరీక్షను ఏడాది పాటు వెంటనే వాయిదా వేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నా రు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమావేశానికి హాజరైన ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు సిలబస్ చదివేందుకు సమయం సరిపోక చాలా మంది అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌లో చెలగాటం ఆడకుండా డీఎస్సీని వాయిదా వేయాలని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

- మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఉట్నూర్, జూలై 11 : హామీ ఇచ్చిన మేరకు కుప్టీ, అడ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం రైతు భరోసా కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించి నెలరోజులపాటు ఇక్కడే ఉన్నానన్నారు. ఇక్కడి ప్రజల, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకోవడం జరిగిందన్నారు. ఏజెన్సీలో రైతు లు వర్షాధారిత పంటలపై ఆధారపడడం, ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతరుల సమస్యలు తెలుసన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టులోగా రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాజాగా రైతుల నుంచి తీసుకున్న అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక రూపంలో శాసనసభ ముందు ఉంచుతామన్నారు. దీనిపై శాసనసభ్యుల అభిప్రాయాలను కూడా సేకరిస్తామన్నారు. న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా అందరికీ అందేలా చర్య లు తీసుకుంటామన్నారు. ఈ పథకాన్ని ఎక్కడ కూడా దుర్వినియోగం కాకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రు లు శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, దీపక్ కుమార్, వెంకటేశ్ ధోత్రె, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం..

### నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి

దిలావర్‌పూర్, జూలై 11 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం న్యూ లోలం, సిర్గాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల స్థాయి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల పూల, పండ్ల మొక్కలను అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా నాటిన ప్రతి మొక్కను రక్షించుకునేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్‌ఖాన్, ఈజీఎస్ ఏపీవో దివ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గోవిందుల మహేశ్, కుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

### లక్ష్యానికి మించి మొక్కలు నాటాలి..

కుంటాల, జూలై 11 : ఈ సీజన్‌లో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం కల్లూరు కేజీబీవీ పాఠశాల, అందకూర్‌లో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, ఈసీ ఇన్‌చార్జి జైసింగ్, టెక్నికల్ అసిస్టెంట్ కార్తీక్, ఫీల్డ్ అసిస్టెంట్లు భోజన్న, రాందాస్ పాల్గొన్నారు.



దిలావర్‌పూర్ : మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో



కూలిన వడ్యాల్ ఆనకట్ బ్రిడ్జి

## కూలిన వడ్యాల్ ఆనకట్ బ్రిడ్జి

లక్ష్మణచాంద, జూలై 11 : వడ్యాల్ గ్రామంలోని చెరువులను నింపడానికి, సాగు కోసం ఉపయోగపడే దశాబ్దాల క్రితం నిర్మించిన వడ్యాల్ ఆనకట్ బ్రిడ్జి కూలిపోయింది. వడ్యా ల్ గ్రామ సమీపంలో గల సరస్వతీ కాలువపై ఉన్న ఈ సాగునీటి బ్రిడ్జి గురువారం కూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిమండల్ నుంచి కనకాపూర్ ద్వారా వడ్యాల్‌కు సాగు నీరందించడానికి ఈ బ్రిడ్జిని సరస్వతీ కాలుపై నిర్మించారు. ఈ బ్రిడ్జి మరమ్మతుకు నిధులు కూడా మంజూరైనట్లు నీటి పారుదల శాఖ ఏఈ మధూకర్ తెలిపారు. వరుసగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేయలేకపోయినట్లు పేర్కొన్నారు. వానకాలం వరినాట్లు మరికొన్ని రోజులలో ప్రారంభం కానుండగా ఈ బ్రిడ్జి పడిపోవడంతో వడ్యాల్ ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు సకాలంలో నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు. మరికొన్ని రోజులలో సరస్వతీ కాలువకు నీరు విడుదల చేయనుండడంతో బ్రిడ్జి నిర్మాణ పనూలు ఇప్పట్లో జరపడం కష్టమని ఏఈ మధూకర్ పేర్కొన్నారు.

## గుణాత్మక విద్యను బోధించాలి..

ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



తేజాపూర్ పాఠశాల ప్రార్థనలో ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

నేరడిగొండ, జూలై 11 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి సూచించారు. గురువారం తేజాపూర్ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, బుగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రోజు వారిగా భోజనం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలను సంధించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఉదయం ప్రేయర్‌కు హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం తేజాపూర్ పాఠశాలలో హరితహారంలో పెరిగిన పండ్ల చెట్లు, వివిధ రకాల చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఉండడాన్ని చూసి సంతోషించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం మణిలత ఉన్నారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్

బోథ్, జూలై 11 : చదువుతోనే సమాజంలో గౌరవం, మర్యాద లభిస్తుందని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్‌జేడీ సత్యనారాయణ అన్నారు. గురువారం సోనాల జడ్పీఎస్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టారు. వంట గదిని పరిశీలించి మధ్యాహ్న భోజన కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సయ్యను విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, పలు రికార్డులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు.